క్లుప్తంగా

ప్రశాంతంగా పీసా కమిటీ ఎన్నిక



నియామకపత్రాన్ని అందజేస్తున్న ఎన్నికల అధికారులు

గూడెంకొత్తవీధి: మండల కేంద్రంలోని పీసా కమిటీ ఉపాధ్యక్షుడిగా గొర్లె వీర వెంకట్ గెలుపొందారు. గూడెంకాలనీ, పూజారిపాకలు, నూతులు, మాలిగుడ గ్రామాలకు సంబంధించి ఆదివారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం వద్ద పీసా కమిటీ ఎన్నికలు జరిగాయి. ఎన్నికైన వీరవెంకట్‌కు అధికారులు నియామకపత్రాలను అందించారు. ఆయనను పలువురు అభినందించారు.

శివారు గ్రామాన్ని ముంపు ప్రాంతంగా గుర్తించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ నాగమణి

ఎటపాక: మురుమూరు గ్రామాన్ని 41.15 కాంటూర్‌లో చేర్చి పోలవరం ముంపుగా గుర్తించాలని సర్పంచ్ నాగమణి , పీసా కమిటీ కార్యదర్శి ఆసు ప్రసాద్ కోరారు. ఆదివారం గ్రామంలో సమావేశం ఏర్పాటు చేసి ముంపుపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముంపు జాబితా తయారీలో వాస్తవాలకు విరుద్ధంగా ఉందని భద్రాచలం వద్ద 43 అడుగులకు వరద చేరితే గ్రామం చుట్టూ వరదనీరు చేరుతుందన్నారు. 2022లో వచ్చిన వరదలకు గ్రామం మొత్తం ముంపునకు గురైందన్నారు. ఇదే సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు.

ఆత్మీయ సన్మానం



వైద్యాధికారి మహేశ్వరరావును సన్మానిస్తున్న చింతపల్లి ఆస్పత్రి సిబ్బంది

చింతపల్లి: చింతపల్లి ఆస్పత్రిలో సుదీర్ఘకాలం గిరిజన ప్రజలకు వైద్య సేవలందించి స్వచ్ఛంద పదవీ విరమణ పొందిన వైద్యాధికారికి సిబ్బంది ఆదివారం ఘనంగా సన్మానించారు. చింతపల్లిలో ఏరియా ఆస్పత్రిలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించి పశ్చిమ గోదావరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా రెండేళ్లపాటు దిగ్విజయంగా విధులు నిర్వహించి స్వచ్ఛంద విరమణ పొందిన సందర్భంగా ఆయనను చింతపల్లి ఆసుపత్రి సిబ్బంది భీమవరంలో కలిసి ఘనంగా సన్మానించారు. ల్యాబ్ టెక్నిషియన్ అనిల్‌కుమార్, ఫార్మసిస్టు గౌరీశంకర్, డీఈవో లక్ష్మీకాంత్, ఎల్‌టి సోమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

పాడేరు రూరల్: భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్)తో పాటు అని విద్యార్థుల సంఘాల పోరాట ఫలితంగానే మధ్యాహ్న భోజన పథకం అమలులోకి వచ్చిందని ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు వి.కృష్ణ చెప్పారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అన్ని రకాల మౌలిక సదుపాయలు కల్పించాలన్నారు. ఖాళీగా ఉన్న అధ్యాపక, ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. మెనూ ప్రకారంగా విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలన్నారు. వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు కళాశాల, పాఠశాలల్లో ఉన్న లైబ్రరీలో అన్ని రకాల మెటీరియల్స్ అందుబాటులో తీసుకురావాలన్నారు. గిరిజన ప్రాంతంలో విద్యార్థుల వరుస మరణాల పరిరక్షణపై ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు వివిధ కారణలతో మృతి చెందిన విద్యార్థుల వివరాలు నేటికీ గుర్తించలేదన్నారు. కూటమి ప్రభుత్వం తక్షణం కళాశాల, పాఠశాల వసతి గృహలో మార్పు తీసుకొచ్చేందుకు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. తనీష్, రాశి, సుహాసిని, గౌరి తదితరులు పాల్గొన్నారు.

మోక్షమెన్నడో?

- ఏళ్ల తరబడి పరాయి పంచనలో తహసీల్దార్ కార్యాలయం
- రెండున్నర దశాబ్దాలుగా అసంపూర్తిగా నిలిచిన నిర్మాణం
- శిథిలభవనంతో సిబ్బందికి అవస్థలు
- పట్టించుకోని అధికారులు



శిథిలదశలో భవనం



అర్ధంతరంగా నిలిచిన నూతన భవనం



నిరుపయోగంగా జనరేటర్

డుంబ్రిగుడ: నాలుగున్నర దశాబ్దాలు దాటినా నేటికీ పరాయిపంచనలోనే ఓ ప్రభుత్వశాఖ నిర్వహణ సాగుతోంది. డుంబ్రిగుడ తహసీల్దార్ కార్యాలయం ఏర్పడినప్పటి నుంచి సొంత భవనం లేక ఫారెస్ట్ శాఖ అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. గతంలో 1980లో రెవెన్యూ తాలూకా ఆఫీసును ఆర్ అండ్‌బీ క్వార్టర్స్‌లో నిర్వహణ జరిగేది. తర్వాత ఈ భవనాన్ని ఫారెస్ట్ శాఖ భవనంలో తహసీల్దార్ కార్యాలయంగా ప్రారంభించారు. కాలక్రమేణ తహసీల్దార్ కార్యాలయంగా నామకరణం చేశారు. కింద భాగంలో తహసీల్దార్ కార్యాలయం పై భాగంలో ఎంపీడీవో కార్యాలయం నిర్వహణ జరిగేది. ఎంపీడీవో కార్యాలయాన్ని వేరుగా 1995లో నిర్మించడంతో అక్కడికి మారింది. అయితే తహసీల్దార్ కార్యాలయానికి నేటికి సొంత భవనం లేక అద్దె భవనంలో కొనుసాగుతోంది. బీటలు వారిన గోడలు, పెచ్చులూడుతున్న శ్లాబ్, వర్షం పడితే గదులన్నీ జలమయమవుతుందని స్థానికులు చెబుతున్నారు. విలువైన రికార్డులు తడిసిపోతున్నాయంటున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారని చెబుతున్నారు. జనరేటర్ నిరుపయోగంగా మారిందని, విద్యుత్ నిలిచినపుడు పనులకు ఆటంకం కలుగుతుందంటున్నారు. కార్యాలయానికి వచ్చే వారికి కూడా ఇబ్బందులు తప్పడం లేదంటున్నారు.

నిలిచిన పనులు

2016–2018 మధ్య కాలంలో తహసీల్దార్ కార్యాలయం భవనాన్ని పలు చాంబర్లుగా విభజించి నిర్మాణాలు మొదలు పెట్టారు. ఇందుకోసం సుమారు రూ.90 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఇందులో భాగంగా మొదటి, రెండువ అంతస్తులకు శ్లాబ్ వరకు పనులు జరిపి అసంపూర్తిగా నిర్మాణాన్ని వదిలేశారు. ఆయా పనులకు రూ.30 లక్షల మేరకు బిల్లులు అయినట్టు తెలిసింది. తరువాత బిల్లులు కాకపోవడంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేసినట్టు పలువురు చెప్పారు. భవనాన్ని అసంపూర్తిగా వదిలేయడంతో గత్యంతరం లేక ఏళ్ల తరబడి అద్దె భవనంలోనే కార్యాలయా కార్యకలాపాలు సాగుతున్నాయి. వసతి ఇతరత్రా సమస్యల వల్ల సిబ్బందితో పాటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు పడితే కార్యాలయనికి రావడానికి ఇబ్బందికరంగా ఉంటుందని , ఎటువంటి నిలువ నీడ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని, శ్లాబ్ పెచ్చులూడిపడుతుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తహసీల్దార్ కార్యాలయానికి శాశ్వత భవనం నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని, దీంతో పాటు సిబ్బందికి స్థానికంగా క్వార్టర్స్ నిర్మించాలని కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం



తహసీల్దార్ భవనం పూర్తి చేసేందుకు ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తాం. ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు పనులు చేపడతాం.

– ముజీబ్, ఇన్‌చార్జి తహసీల్దార్, డుంబ్రిగుడ

మహిళా హక్కులపై అవగాహన అవసరం



మహిళ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న బీఏఎంసీఈఎఫ్ ప్రతినిధులు

ముంచంగిపుట్టు: సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకొని బ్యాక్ వర్డ్ అండ్ మైనార్టీ కమ్యూనిటీ ఎంప్లాయిస్ ఫెడరేషన్(బీఏఎంసీఈఎఫ్ ఎస్సీ, ఎస్టీ, బీసీ)మండల శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఆదివారం మహిళా ఉపాధ్యాయులను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. సావిత్రిబాయి పూలే, జ్యోతిరావు పూలే, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మహనీయుల త్యాగాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా బీఏఎంసీఈఎఫ్ ప్రతినిధులు చంద్రశేఖర్, కోటిబాబులు మాట్లాడుతూ మహిళా విద్య ప్రదాత సావిత్రిబాయిపూలే అని అన్నారు. మహిళా హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మహిళా హక్కులను సాధించడం ద్వారానే మానవహక్కుల సాధన సంపూర్ణమవుతుందనే విశ్వాసంతో తన జీవితకాలం పోరాడుతూ ప్రతి ఒక్క మహిళలను గౌరవించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఫెడరేషన్ ప్రతినిధులు కృష్ణారావు, రామకృష్ణ, కామేశ్వరరావు, కామేష్, చిట్టిదొర, రాజుబాబు, సూర్యనారాయణ, సురేష్, వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త గ్యానమోని మృతికి సంతాపం



మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ యువజన రాష్ట్ర కార్యదర్శి చెట్టి వినయ్

డుంబ్రిగుడ: మన్యంలోని వైఎస్సార్‌సీపీ కార్యకర్త కష్టా సుఖాలలో వెన్నంటి ఉండి వారికి భరోసా అందివ్వడమే తన లక్ష్యమని పార్టీ రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి, అరకు ఎంపీ డాక్టర్ గుమ్మ తనుజారాణి భర్త చెట్టి వినయ్ చెప్పారు. మండలంలోని కొర్ర గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త శెట్టి గ్యానమోని (62) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న చెట్టి వినయ్ కొర్ర గ్రామంలో సందర్శించి మృతురాలి పార్థీవదేహానికి నివాళిలర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులు సోములు, సింహాచలం, రమేష్ తదితరులకు తమ ప్రగాఢ సానుభుతి తెలిపారు. పార్టీ కార్యకర్తలకు పార్టీ అన్ని వేళల్లో అండగా ఉంటుందన్నారు. ఎంపీటీసీ సభ్యురాలు జి.విజయ, సర్పంచ్ అర్జున్, సీపీఎం మండల కార్యదర్శ పోతురాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు చిరంజీవి, గణపతి, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



చింతపల్లి సీఎంహెచ్ స్కూల్‌లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

చింతపల్లి: చింతపల్లి గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాలలో విద్యనభ్యసించిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ కలయికతో సందడి వాతావరణం నెలకొంది. 2001–02 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు 23 సంవత్సరాలు అనంతరం తాము చదువుకున్న పాఠశాలలో కలుసుకున్నారు. పూర్వ జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. పూర్వ విద్యార్థి పెయ్యిల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉదయం నుంచి పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థులు సందడి చేశారు. ప్రధానోపాధ్యాయులు సాగిన రామరాజుపడాల్, ఉపాధ్యాయుడు తగ్గి త్రిమూర్తులును ఘనంగా సన్మానించారు. అనంతరం లంబసింగిలో అంతా కలసి సహపంక్తి భోజనం చేశారు. కృష్ణ కిషోర్, రామవరప్రసాద్, బుజ్జిబాబు, రాజుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలి



విలేకరులతో మాట్లాడుతున్న సురేంద్ర

అరకులోయటౌన్: అనంతగిరి మండలంలోని సీపీఎం నాయకులు జేష్ఠ వెంకటరమణ, ఆర్.శ్రీనులపై దాడికి పాల్పడిన రియల్టర్ , గిరిజనేతరుడు అయిన నగేష్‌పై ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కిల్లో సురేంద్ర ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అనంతగిరి మండలం భీంపోల్ పంచాయతీ చర్యపల్లిలోని సర్వే నెంబర్ 66లో 13 ఎకరాల ప్రభుత్వ సీలింగ్ భూమిని ఆక్రమించి చదును చేస్తుండగా గమనించి విషయాన్ని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసిన వెంకటరమణ, శ్రీనులపై రియల్టర్ దాడి చేయించారని ఆరోపించారు. ఆయనపై కేసు నమోదు చేసి, చట్టపరంగా శిక్షించాలని, ఆక్రమించిన ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలన్నారు. రామారావు, ఏపీజీఎస్ నాయకుడు అర్జున్ ఉన్నారు.

దుస్తులు, రగ్గుల పంపిణీ



చిన్నగెడ్డలో వృద్ధులకు రగ్గులు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ బాలయ్యపడాల్ తదితరులు

చింతపల్లి: ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకు చేదోడు వాదోడుగా ఉంటూ వారికి అత్యవసర సమయాల్లో ఆదుకునే స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయమని జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్యపడాల్ అన్నారు. చింతపల్లి పంచాయతీ పరిధిలోని చిన్నగెడ్డ గ్రామంలో భరోసా లవ్ ఫర్ హ్యూమానిటీ ట్రస్ట్, బియాస్ డోనర్ సంస్థలు భాగస్వామ్యంతో గిరిజనులకు నిత్యావసర సరకులు, వృద్ధులు మహిళలకు దుప్పట్లు, రగ్గులను విద్యార్థులకు విద్యా కిట్లను పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్యపడాల్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో గిరిజనులను అన్ని విధాలుగా ఆదుకుంటున్న స్వచ్ఛంద సంస్థలను సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. ఈ సంస్థలు చేపట్టే కార్యక్రమాలకు ఎప్పుడూ తమ వంతు సహకారం ఉంటుందన్నారు. సంస్థ చైర్మన్ అట్టాడ అవినాష్, కార్యదర్శి బల్లా శ్రీనివాసరావు, సలహాదారు కమల్ కుమార్, మాజీ వైస్ ఎంపీపీ కృష్ణారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు నరేష్, ఈశ్వరరావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ వెంకటేష్, పోలీసు సిబ్బంది

గంగవరం : ఆటోల్లో, వాహనాల్లో అనుమతులు లేని నిషేధిత వస్తువులను రవాణా చేయొద్దని, వాహనాచోదకులు అన్ని వాహన పత్రాలు సక్రమంగా కలిగి ఉండాలని ఎస్‌ఐ బి.వెంకటేశ్ అన్నారు. గంగవరం– అడ్డతీగల , గంగవరం–రంపచోడవరం, గంగవరం– గోకవరం రూట్‌లలో ఆదివారం విస్తృత్తంగా వాహనాలు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాదారులకు పలు సూచనలు చేశారు. లైసెన్స్‌లు లేకుండా వాహనాలు నడిపినా , గంజాయి, సారా వంటి రవాణా చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ద్విచక్ర వాహనచోదకులు సెల్‌ఫోన్లు మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం ద్వారా అనే ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వాహనచోదకులకు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని అవగాహన కల్పించారు.

నిబంధనలకు పాతర

- కోరం లేక పీసా కమిటీ ఎన్నిక

పాడేరు రూరల్: మండలంలో వంజంగి పంచాయతీ పరిధిలో ఆదివారం నిర్వహించిన పీసా కమిటీ ఎన్నికలు నిబంధనలకు విరుద్ధంగా కోరం లేకుండా నిర్వహించారని స్థానికుడు ఎం.ప్రసాద్ తదితరులు ఆరోపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధికార పార్టీ నాయకుల అండతో అధికారులు ఎన్నికలు జరిపించడం సరైన పద్ధతి కాదన్నారు. ప్రజలందరూ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించిన పీసా ఎన్నికలను వ్యతిరేకిస్తున్నామన్నారు. తక్షణంగా కలెక్టర్ దినేష్‌కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్ జోక్యం చేసుకొని పూర్తి స్థాయిలో కోరంతో పీసా కమిటీ ఎన్నికలు నిర్వహించాలని కోరారు.

తారుమారు సంత రేపు

ఏర్పాట్లు పూర్తి



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న సర్పంచ్ రాంబాబు, ఎంపీటీసీ సన్యాసిదొర తదితరులు

జి.మాడుగుల: మండల కేంద్రంలోని వెంకటరాజ్ సమీపమున గల పొలాల్లో మంగళవారం తారుమారు సంత(పండుగ సంత) నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సర్పంచ్ కిముడు రాంబాబు, లువ్వాసింగి ఎంపీటీసీ గబ్బాడి సన్యాసిదొర అధ్వర్యంలో ఏర్పాట్లు పనులు చేపడుతున్నారు. ఏటా జనవరి నెలలో వచ్చే సంక్రాంతి పండుగను దృష్టిలో పెట్టుకొని తారుమారు సంతను ఒక జాతరగా జరుపుకోవటం పూర్వం నుంచి వస్తున్న అచారం. అల్లూరి జిల్లా నుంచి కాకపొరుగున ఉన్న అనకాపల్లి, విశాఖపట్నం, తూర్పు గోదావరి జిల్లాలో పలు ప్రాంతాలను వ్యాపారులు ప్రజావసర దుకాణాలు, షాపులు వంటి ఏర్పాటు చేస్తారు. గిరిజన ప్రాంతాల్లో రైతులు వ్యవసాయ, అటవీ ఉత్పత్తులు తీసుకొచ్చి విక్రయిస్తారు. దినుసులు విక్రయించగా వచ్చిన డబ్బుతో సంక్రాంతి పండుగకు సంబంధించిన వస్తు సామాగ్రి, కొత్త దుస్తులు, కొత్త కుండలు కొనుగోలు చేస్తారు. వేర్వేరు ప్రాంతాల నుంచి ఈ సంతకు గిరిజన ప్రజలు తమ కుటుంబ సభ్యులతో పాటు యుక్త వయస్సు గల పిల్లలను వెంట తీసుకొచ్చి తమ బంధువులు, స్నేహితులకు పరిచయాలు చేస్తారు. ఆయా బంధువులు, స్నేహితులంతా కలుసుకోవడానికి తారుమారు సంత ఒక వేదికగా మారుతుంది. ఆదివాసీ గిరిజన ప్రజలు తారుమారు సంతలో వారి, వారి బంధువులు, స్నేహితులు ఒక దగ్గరుకు చేరి ఆత్మీయ సమావేశాలు ఏర్పాటు చేసి బంధుత్వాలు కూడా కలుపుకుంటారు. తారుమారు సంతలో కలుసుకున్న బంధువులు, స్నేహితులు, కొత్తగా బంధుత్వాలు కలుపుకున్న వారు సంక్రాంతి పండుగకు ఒకరికొకరు కుటుంబాలతో ఆహ్వానించుకుంటారు. ఇక్కడ జరగనున్న సంతకు సుమారు 10వేల నుంచి 15వేల మంది వస్తారని అంచనా. తారుమారు సంతకు వచ్చే ప్రజలకు వ్యాపారులకు ఎటువంటి ఇబ్బందులు, సమస్యలు తలెత్తకుండా అన్ని సదుపాయాలను ఏర్పాట్లు చేస్తున్నట్టు సర్పంచ్ రాంబాబు, ఎంపీటీసీ సభ్యుడు సన్యాసిదొర తెలిపారు.

భక్తిశ్రద్ధలతో మేలుకొలుపు



కె.వెంకటాపురంలో మేలుకొలుపులో పాల్గొన్న భక్తులు

కోటవురట్ల: మేలుకొలుపుతో పల్లెలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంటున్నాయి. వేకువజామునే మేలుకొలుపు చేసి భక్తిని చాటుకుంటున్నారు.

కె.వెంకటాపురంలో ఆదివారం తెల్లవారుజామున మేలుకొలుపు పాడారు. రామాలయం నుంచి వీధుల్లో తిరుగుతూ సంకీర్తన చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పిల్లలు సైతం చలిని కూడా లెక్క చేయకుండా మేలుకొలుపులో పాల్గొని సంకీర్తన చేశారు.

చిన్న భీరంపల్లిలో రోడ్డు ప్రమాదాలు

- గొయ్యి పూడ్చని వైనం
- కానరాని హెచ్చరిక బోర్డులు
- మట్టిగుట్టను ఢీకొని గాయాలపాలైన వాహనచోదకులు
- ఒక్క రోజులో మూడు ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు



చిన్న భీరంపల్లి వద్ద గొయ్యి పూడ్చకుండా వదిలేయడంతో పేరుకపోయిన వ్యర్థాల గుట్ట

రంపచోడవరం: రంపచోడవరం మండలం చిన్న భీరంపల్లి వద్ద జాతీయ రహదారి–516ఇపై ఉన్న వంతెన వద్ద శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయానికి మూడు రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుని పలువురు తీవ్ర గాయాలు పాలయ్యారు. వంతెన వద్ద మరమ్మతుల కోసం పెద్ద గొయ్యిని తీశారు. దాన్ని పూడ్చకుండా అలానే వదిలేశారు. మట్టి, తారు పెల్లాలు అలానే వదిలేయడంతో గుట్టుగా మారింది. ఈ మార్గంలో శనివారం రాత్ర నుంచి ఆదివారం ఉదయం వరకు రాకపోకలు సాగించిన వాహనచోదకులు పూడ్చని గోయ్యిని గమనించక మట్టిగుట్టను ఢీకొని పడిపోయారు. తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికులు హుటాహుటిన వారి రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించారు. చీకటి పడితే ఇంకెన్నీ ప్రమాదాలు జరుగుతాయోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరెన్ని ప్రమాదాలు జరగకముందే ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే గొయ్యిని పూడ్చి పేరుకున్న మట్టిగుట్ట(వ్యర్థాలను) తొలగించాలని వారు కోరుతున్నారు.

యూటీఎఫ్ సభలకు తరలివెళ్లిన నాయకులు



కాకినాడ తరలివెళ్తున్న యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు



రాజవొమ్మంగి నుంచి పయనమైన నాయకులు

గంగవరం: కాకినాడ పీఆర్ కళాశాల గ్రౌండ్స్‌లో జరగనున్న యూటీఎఫ్ స్వర్ణోత్సవ వేడుకలకు గంగవరం మండలం నుంచి భారీగా ఉపాధ్యాయులు, యూటీఎఫ్ నాయకులు తరలివెళ్లారు. ఆదివారం యూటీఎఫ్ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్.రాంబాబు, వెంకటేశ్వరరావు, రాష్ట్ర మహిళా కౌన్సిలర్ రుక్మిణీదేవి, నాయకులు బొజ్జిదొర, రామకృష్ణారెడ్డి, సత్యకిరణ్ ఆధ్వర్యంలో మండల ఉపాధ్యాయులు, నాయకులు తరలివెళ్లారు.

రాజవొమ్మంగి : కాకినాడలో యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలకు రాజవొమ్మంగి మండలం నుంచి యూటీఎఫ్ నాయకులు ఆదివారం ఉత్సాహంగా తరలివెళ్లారు. మండలం నుంచి సుమారు 100 మంది ఉత్సవాల్లో పాల్గొంటున్నట్టు మండల ఫెడరేషన్ అధ్యక్షుడు వెంకట సుబ్బారావు తెలిపారు. నాయకులు శ్రీను, లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావం సభకు తరలివెళ్లిన గిరిజనం



జి.మాడుగుల నుంచి విజయవాడకు తరలివెళ్తున్న భక్తులు



అడ్డతీగల నుంచి శంఖారావం సభకు వెళ్లేందుకు సిద్ధమైన భక్తులు



గంగవరం నుంచి శంఖారావం సభకు వెళ్తున్న భక్తులు

జి.మాడుగుల: విజయవాడలో హైందవ శంఖారావం బహిరంగ సభకు ఆదివారం ఉదయం మండల కేంద్రం నుండి భక్తులు బయలుదేరి వెళ్లారు. విశ్వహిందూ పరిషత్ ధర్మ ప్రచారకుడు రీమెలి అప్పలరాజు అధ్వర్యంలో 5బస్సులు ఏర్పాటు చేసారు.ఆయా బస్సుల్లో మండలంలో వివిధ ప్రాంతాలకు చెందిన 280మంది భక్తులతో కలసి వెళ్లారు.

అడ్డతీగల: విజయవాడలో ఆదివారం నిర్వహించిన హైందవ శంఖారావానికి మన్యంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు స్వచ్ఛందంగా తరలివెళ్లారు. ఆదివారం తెల్లవారుజామునే ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న బస్సుల్లో విజయవాడకు వెళ్లారు.జి.మాడుగుల, అడ్డతీగల, వై.రామవరం, గంగవరం, రాజవొమ్మంగి మండలాల నుంచి బస్సుల్లో హైందవ సోదరులు శంఖారావానికి వచ్చినట్టు ఆర్ఎస్ఎస్ ప్రౌఢ్ ప్రముఖ్ వేణుం వెంకటరత్నం తెలిపారు.

అడ్డతీగల మండలం వెదురునగరం నుంచి హైందవ శంఖారావానికి 37 గ్రామాల నుంచి 603 మంది 10 బస్సుల్లో వెళ్లినట్టు వీహెచ్‌పీ జిల్లా సహ సేవా ప్రముఖ్ భావన్నారాయణ తెలిపారు. ఇవి కాకుండా 78 కార్లలో 44 మోటార్ సైకిళ్లలోనూ శంఖారావానికి హాజరైనట్టు చెప్పారు.

గంగవరం : విజయవాడలో ఆదివారం జరిగిన హైందవ శంఖారావ బహిరంగ సభకు మండలం నుండి భారీగా భక్తులు తరలివెళ్లారు. విశ్వహిందు విశేష సంపర్క ప్రముఖ్ ప్రసాద్, వనవాసీ ప్రముఖ్‌లు శ్రీనివాస్‌దొర, భారతి సమరసత ఫౌండేషన్ కన్వీనర్ చిన్నాలరావు దొర ఆధ్వర్యంలో భారీగా భక్తులు వెళ్లారు.